ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 10-09-2025 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. తెలంగాణ ప్రభుత్వం చేపట్టనున్న గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు విజ్ఞప్తి చేశారు.

2. హైదరాబాద్ ఫార్ములా ఈ-రేస్ నిర్వహణలో క్విడ్ ప్రో ఉన్నట్లు గుర్తించిన ఏసిబి అప్పటి మంత్రి కే. తారక రామారావుతో సహా పలువురిపై చార్జ్ షీట్ దాఖలు చేయడానికి ప్రభుత్వ అనుమతిని కోరింది.

3. పత్తి దిగుమతులపై 11 శాతం సుంకం ఎత్తివేత వల్ల రైతులపై తీవ్ర ప్రభావం పడుతుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు.

4. తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రముఖులు ఆమెకు ఘనంగా నివాళులర్పిస్తున్నారు.

**CM-RAJNATH:**

తెలంగాణ ప్రభుత్వం చేపట్టనున్న గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు విజ్ఞప్తి చేశారు. ఆయన ఈ ఉదయం ఢిల్లీలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశమయ్యారు. మూసీ, ఈసా నదుల సంగమ స్థలిలో గాంధీ సరోవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తామని, ఈ సంగమ స్థలిలో గాంధీసర్కిల్ ఆఫ్ యూనిటీ నిర్మాణం చేపడతామని, అందుకు అక్కడి 98.20 ఎకరాల రక్షణ శాఖ భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని

కోరారు. గాంధీ సిద్ధాంతాలను ప్రచారం చేసే నాలెడ్జ్ హబ్ , ధ్యాన గ్రామం, చేనేత ప్రచార కేంద్రం, ప్రజా వినోద స్థలాలు , ల్యాండ్ స్కేప్ , ఘాట్లు, శాంతి విగ్రహం , మ్యూజియం గాంధీ సరోవర్ ప్రాజెక్టులో నిర్మిస్తామని వివరించారు.

SDP

## ఈ – ఫార్ములా

హైదరాబాద్ ఫార్ములా ఈ-రేస్ నిర్వహణలో క్విడ్ ప్రో కో కోణం ఉన్నట్లు రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ ఏసిబి తన తొమ్మిది నెలల దర్యాప్తులో గుర్తించింది. ఈ వ్యవహారంలో హెచ్ఎండీఏకు 75.88 కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని , ఫార్ములా ఈ-ఆపరేషన్స్ ( FEO) అనే సంస్థ 46 కోట్లు రూపాయలు లబ్ధి పొందిందని ఏసీబీ అంచనా వేసింది. ఈ క్విడ్ ప్రో కోలో భాగంగా 44 కోట్ల రూపాయలు విలువైన ఎలక్టోరల్ బాండ్లు భారత రాష్ట్ర సమితి పార్టీకి అందాయని ఏసీబీ ఆరోపించింది. ఈ నేపథ్యంలో అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కే తారక రామారావుతో పాటు ఇతర నిందితులపై అభియోగాల నమోదుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఏసీబీ నిన్న రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. యూకే చట్టాల ప్రకారం నమోదైన ఎఫ్ఈవో సంస్థ , హైదరాబాద్‌లో 9-12 సీజన్ల ఫార్ములా ఈ-రేస్‌లను నిర్వహించడానికి నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు ప్రాసిక్యూషన్ కోరుతూ ఈ నివేదికను రాష్ట్ర గవర్నర్ కు పంపనుంది. గవర్నర్ నిర్ణయాన్ని బట్టి తదుపరి చర్యలు ఉంటాయి.

SDP

## రహదారులు-సీఎం

రాష్ట్రంలో రహదారుల సీఆర్ఐఎఫ్ పనులకు సంబంధించి త్వరలో అధికారులను హైదరాబాద్ పంపుతామని కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ చెప్పినట్లు అధికారవర్గాలు తెలిపాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిన్న ఢిల్లీలో కేంద్రమంత్రిని కలిసి , రాష్ట్రంలోని వివిధ రహదారుల నిర్మాణం , విస్తరణ ఆవశ్య కతన వివరించారు.ఫ్యూచర్ సిటీ నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి మీదుగా మచిలీపట్నం వరకు పన్నెండు వరుసల రహదారిని

నిర్మించాలని, హైదరాబాద్ రీజనల్ రింగ్ రోడ్డు ఉత్తరభాగం పనులకు ఆర్థిక అనుమతి మంజూరు చేయాలని కోరారు.

డెస్క్

సుంకాలు –తుమ్మల

పామోయిల్ పై ఇప్పటికే దిగుమతి సుంకం తగ్గింపు వల్ల రైతులు నష్ట పోయారని,ఇప్పుడు పత్తి దిగుమతులపై 11 శాతం సుంకం ఎత్తివేత తీవ్ర ప్రభావం చూపుతుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమెరికా ఒత్తిడికి తలొగ్గి కేంద్ర ఈ నిర్ణయం తీసుకోవడం శోచనీయయమని అన్నారు. పత్తి దిగుమతిపై సుంకం ఎత్తివేత, యూరియా సరఫరాపై మంత్రి నిన్న సచివాలయంలో సమీ క్షించారు.

డెస్క్

మహిళా సాధికారిత సదస్సు

తిరుపతిలో ఈ నెల 14, 15 తేదీల్లో చట్టసభల మహిళా సాధికార కమిటీల జాతీయ సదస్సు జరుగుతుంది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సదస్సును ప్రారంభిస్తారు. రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ రెండు రోజుల సదస్సు కు హాజరవుతారని నిర్వాహకులు చెప్పారు. అన్ని రాష్ట్రాల శాసనసభ సభల్లోని మహిళా సాధికార కమిటీల ఛైర్‌పర్సన్లు , సభ్యులు, పార్లమెంట్, అసెంబ్లీల అధికారులు , ఇతర సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొంటారు.

డెస్క్

కాళేశ్వరం

కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి వచ్చిన అవినీతి ఆరోపణలపై సీబీఐతో పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని బీజేపీ శాసనసభ పక్షం ఉపనేత పాయిల్ శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ విషయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ను

కాపాడేందుకే ప్రభుత్వం సుందిళ్ల , మేడిగడ్డ అన్నారం బ్యారేజీలపైనే విచారణను ఆదేశించిందని ఆయన నిన్న విలేకరుల సమావేశంలో అన్నారు. సీబీఐ విచారణ జీవోను 15 రోజుల్లో సవరించాలని ఆయన డిమాండ్ చేశారు.

డెస్క్

ఆర్టీసీ యాత్రాదానం

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రవేశపెట్టిన 'యాత్రాదానం' పోస్టర్ ను రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నిన్న ఆవిష్కరించారు. అనాథలు , నిరాశ్రయ వృద్ధులు , నిరుపేదలను ప్రముఖ పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలకు తీసుకువెళ్లేందుకు ఈ పథకాన్ని ఉద్దేశించారు. ఈ సందర్భంగా సంస్థ ఎండీ సజ్జనార్ మాట్లాడుతూ , కార్పొరేట్ సంస్థల తో సహా వివిధ వర్గాల వారు ఈ పథకానికి విరాళాలు అందించాలని కోరారు. మంత్రితో పాటు ఆయన లక్ష రూపాయల వంతున విరాళం ప్రకటించారు.

డెస్క్

ఐలమ్మ వర్ధంతి

పెత్తందారులు దోపిడీని అడ్డుకొని మహిళాలోకినికి స్ఫూర్తినిచ్చన తెలంగాణ ధీరవనిత చాకలి ఐలమ్మ వర్ధంతిని ఈరోజు పాటిస్తున్నారు. ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఈ సందర్భంగా ఈరోజు కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన ఐలమ్మ వర్ధంతి సభలో నివాళులు అర్పించారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి మాట్లాడుతూ, తెలంగాణ సాయుధ పోరాటంలో అమరులైన మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయవలసి ఉందని అన్నారు.

-

ఐలమ్మ.....రాజన్న సిరిసిల్ల

తెలంగాణ రైతు లు సాయుధ పోరాటంలో వీర త్వాన్ని ప్రదర్శించిన చాకలి ఐలమ్మ ఆశయాలను ప్రతి ఒక్కరు స్పూర్తిగా తీసుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. ఆమె వర్ధంతి సందర్భంగా జిల్లా కలెక్టరేట్ సముదాయంలో జరిగిన

కార్యక్రమంలో చిత్రపటానికి పూల మాలలు వేసి , ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి సౌజన్య , వివిధ శాఖల అధికారులు , సిబ్బంది , రజక సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

-

ఐలమ్మ మెదక్

మెదక్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఐలమ్మ వర్ధంతి సభలో కలెక్టర్ రాహుల్ రాజ్ పూలమాల వేసి నివాళులర్పించారు. భూస్వాముల దురాగతాలపై తిరుగుబాటు చేసిన ఐలమ్మ ధైర్యం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని ఆయన అన్నారు.

పిటిసి, ఆసిఫాబాద్, సిరిసిల్ల, మెదక్

**ఐలమ్మ వరంగల్**

తెలగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ ప్రదర్శించిన తెగువ , పౌరుషం ఈ ప్రాంత అస్థిత్వాన్ని , ఆత్మ గౌరవాన్ని చాటాయని హనుమకొండ , వరంగల్ జిల్లా కలెక్టర్లు స్నేహ షబరీస్ , డాక్టర్ సత్య శారద కొనియాడారు. ఐలమ్మ వర్ధంతి సందర్భంగా వారు ఆమెకు నివాళులర్పించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు కార్యక్రమానికి హాజరయ్యారు.

పిటిసి, వరంగల్

**ఐలమ్మ – ఆది శ్రీనివాస్**

పేదల పక్షాన భూ స్వాముల దురాగతాలపై తిరగబడ్డ ధీరవనిత చాకలి ఐలమ్మ అని , ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ నివాళులర్పించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా చాకలి ఐలమ్మ వర్ధంతి జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ ప్రసంగిస్తూ...

**బైట్ ... ఆది శ్రీనివాస్**

పిటిసి, రాజన్న సిరిసిల్ల

**వాతావరణం**

వచ్చే రెండురోజుల్లో రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో వర్షాలు పడతాయని వాతావరణ కేంద్రం తెలిపింది. హైదరాబాద్ తో సహా ఉమ్మడి ఆదిలాబాద్ , నిజామాబాద్, వరంగల్ , యాదాద్రి భువనగిరి, వికారాబాద్, మల్కాజ్ గిరిలో వానలు పడతాయని పేర్కొంది.

డెస్క్

మిడ్ మానేరు ప్రాజెక్టు ముంపు

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కొదురుపాక , వరదవెల్లి, నీలోజిపల్లి గ్రామాల నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ అండ్ ఆర్ పట్టా' ధ్రువీకరణ పత్రం పొందిన నిర్వాసితులు సంబంధిత గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈనెల, 11 తేదీ సాయంత్రంలోగా దరఖాస్తులు అందచేయాలని సూచించారు.

పీటీసీ...రాజన్న సిరిసిల్ల

**లోయర్ మానేరు**

కరీంనగర్ జిల్లా లోయర్ మానేరు జలాశయానికి పెద్ద ఎత్తున వరద నీరు చేరుతుండడంతో 2 గేట్లను ఒక అడుగు మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం సామర్థ్యం 24.34 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 23.51 టీఎంసీలుగా నమోదైంది. ఈ సందర్భంగా

మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ....వచ్చే ఏడాది జిల్లాలో సాగు, తాగు నీటి కొరత ఉండబోదని చెప్పారు.

**పీటీసీ – కరీంనగర్**

**సదరన్ శిబిరాలు**

ఆసిఫాబాద్ జిల్లాలో ఈ నెల 15 నుంచి సదరన్ శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి దత్తరావు ఒక ప్రకటనలో తెలిపారు. 15న అంధులకు, 16న బదిరులకు , 18న నేత్ర సమస్యలు ఉన్న వారికి ఈ శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు.

**పీటీసీ – ఆసిఫాబాద్**